## క్లుప్తంగా

### ఆర్‌వైఎస్‌ఎల్ క్రికెట్ టోర్నీ ప్రారంభం



క్రికెట్ ఆడి టోర్నీ ప్రారంభిస్తున్న అలేఖ్యరెడ్డి

రాయదుర్గం(డి హీరేహాళ్): యువనేత కాపు ప్రవీణ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన ఆర్‌వైఎస్‌ఎల్-3 మెగా స్పోర్ట్స్ లీగ్‌ను ఆదివారం డి హీరేహాళ్ మండలం జాజరకల్లు సమీపాన ఏర్పాటు చేసిన మైదానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి కోడలు కాపు అలేఖ్యరెడ్డి బ్యాటింగ్ చేసి మ్యాచ్‌ను ప్రారంభించి క్రీడాకారులను ఉత్తేజ పరిచారు. ఆమె మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలన్నారు. భవిష్యత్తులో రాయదుర్గం ప్రాంతంలో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయాలన్నదే విప్ కాపు లక్ష్యమని గుర్తుచేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎం.వన్నూర్‌స్వామి, మార్కెట్‌యార్డ్ చైర్మన్ భోజరాజ్‌నాయక్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రాళ్ల తిమ్మారెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు చంద్ర, మైనార్టీ నాయకుడు రహంతుల్లా, సర్పంచులు మల్లికార్జున, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### నేడు 'స్పందన' లేదు

కూడేరు: తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే స్పందన కార్యక్రమం సోమవారం లేదని తహసీల్దార్ శేషారెడ్డి ఆదివారం తెలిపారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా సెలవు దినం కావడంతో స్పందన ఉండదన్నారు. ఈ విషయాన్ని మండల ప్రజలు గమనించి అర్జీలిచ్చేందుకు తహసీల్దార్ కార్యాలయం వద్దకు రావద్దని ఆయన తెలిపారు.

### కనులపండువగా ఆవుల జాతర



అలంకరణలో మచ్చంద్రమయ్య స్వామి

కుందుర్పి: మచ్చంద్రమయ్య జాతరలో భాగంగా రెండో రోజు ఆదివారం ఆవుల జాతర, గ్రామోత్సవం కనుల పండువగా నిర్వహించారు. మధ్యాహ్నం స్వామిని ప్రత్యేకంగా అలంకరించి గ్రామ శివారులోకి గ్రామోత్సవంగా తీసుకెళ్లి ఉత్సవం నిర్వహించారు. రైతులు స్వామి చుట్టూ మూగజీవాలను మూడుసార్లు తిప్పి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రికి వంకలో జాతర చేపట్టారు. మండల ప్రజలేగాక కర్ణాటక నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్‌ఐ వెంకటేశులు, సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేశారు.

### విద్యార్థి విభాగం ఉపాధ్యక్షుడిగా రమేష్



బోయ రమేష్‌ను అభినందిస్తున్న కాపు ప్రవీణ్‌రెడ్డి

కణేకల్లు: వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షుడిగా జక్కలవడికి గ్రామానికి చెందిన బోయ రమేష్ నియమితులయ్యారు. ఆదివారం విప్ కాపు తనయుడు కాపు ప్రవీణ్‌రెడ్డిని బోయ రమేష్ కలిశారు. ప్రవీణ్ ఆయనకు శాలువా కప్పి పూలమాల వేసి అభినందించారు. విద్యార్థి విభాగం ఉపాధ్యక్షుడిగా నియమించినందుకు విప్ కాపు రామచంద్రారెడ్డితో పాటు ప్రవీణ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రాబోవు ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉదయ్, హంపి శివయ్య తదితరులు పాల్గొన్నారు.

### శ్రీనివాసులు మృతి తీరనిలోటు



కొత్త శ్రీనివాసులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ఉరవకొండ: పట్టణానికి చెందిన ఆప్కో మాజీ డైరెక్టర్, చేనేత బ్లాక్ లెవెల్ క్లస్టర్ చైర్మన్ కొత్త శ్రీనివాసులు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడం చేనేత వర్గాలకు తీరని లోటు అని వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం రాష్ట్ర నాయకులు మిడత చంద్రమౌళి అన్నారు. ఆదివారం శివరామిరెడ్డి కాలనీలోని కొత్త శ్రీనివాసులు నివాసానికి వెళ్లి ఆయన చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో ఉరవకొండ చేనేత విభాగం నాయకులు నిమ్మల వెంకటరమణ, ఆర్‌సీ ప్రసాద్, లక్క ఎర్రిస్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు క్రిస్మస్ వేడుకలు



కళ్యాణదుర్గం: ముస్తాబైన సీఎండ్‌ఐజీఎం చర్చి



కళ్యాణదుర్గం: క్రీస్తు పుట్టిన పశువుల పాక నమూనా



కంబదూరు: అలకంకరణలో సీఅండ్‌ఐజీ మిషన్ చర్చి

- ముస్తాబైన చర్చీలు
- ఆకట్టుకుంటున్న పశువులపాక, ట్రీ నమూనాలు

రాయదుర్గంటౌన్: క్రైస్తవుల ఆరాధ్యదైవం ఏసు క్రీస్తు జన్మదిన వేడుకలకు చర్చిలన్నీ ముస్తాబయ్యాయి. ఆదివారం క్రిస్మస్ వేడుకలను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకోనున్నారు. పట్టణంలోని సెయింట్ మేరీ మాత చర్చి, డాక్టర్ ఎస్‌ఆర్ జాన్ మెమోరియల్ బాపిస్టు చర్చి, నేసేపేటలోని ఎప్రాత ప్రార్థన మందిరం, గిల్గాలు చర్చి, హోసన్నా ప్రార్థనా మందిరం, రాజీవ్‌గాంధీ కాలనీలోని క్రైస్ట్ చర్చి, జీసస్ కాలింగ్ మినిస్ట్రీస్, , కేఎస్ క్రైస్ట్ చర్చిలను విద్యుద్దీపాలంకరణలతో ముస్తాబు చేశారు. ప్రార్థనా మందిరాల్లో క్రిస్మస్ ట్రీలను అందంగా అలంకరించారు.

కళ్యాణదుర్గం: క్రిస్మస్‌ను పురస్కరించుకుని ఆదివారం కళ్యాణదుర్గం పట్టణంతో పాటు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో క్రైస్తవులు చర్చిలను అత్యంత సుందరంగా ముస్తాబు చేశారు. విద్యుత్ లైట్లు, క్రిస్మస్ చెట్లు, క్రీస్తు జన్మించిన పశువుల పాకలు వంటి వాటితో ఆయా చర్చిలలో ప్రత్యేకంగా అలంకరించారు. పట్టణంలోని సీఅండ్‌ఐజీఎం, హోసన్నా, కల్వరి టెంపుల్, విక్టరీ, గాస్పెల్‌తో పాటు పలు చర్చిలను అత్యంత సుందరంగా ముస్తాబు చేశారు. సోమవారం క్రీస్తు జన్మదినం సందర్భంగా జరుపుకునే క్రిస్మస్ వేడుకల్లో ఆయా సంఘాల పాస్టర్లు క్రీస్తు సందేశంతో పాటు ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు.

కంబదూరు: క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని చర్చిలను క్రైస్తవులు సుందరంగా ముస్తాబు చేశారు. మండల కేంద్రంలోని వందేళ్ల నాటి పురాతనమైన సీఆండ్‌ఐజీ మిషన్ చర్చిని విద్యుత్ దీపాలు, రంగురంగుల బెలూనులు, తోరణాలతో అలంకరించారు. చర్చి ఆవరణలో ఏర్పాటు చేసిన పశువు పాక ఆకట్టుకుంటోంది.

ఉరవకొండ: పట్టంలోని టవర్ క్లాక్ సమీపంలోని సీఎస్‌ఐ చర్చిలో సోమవారం జరిగే క్రిస్మస్ వేడుకల్లో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ వై.ప్రణయ్‌రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొంటారని నిర్వాహకులు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. చర్చిలో ఉదయం 11 గంటలకు జరిగే కార్యక్రమానికి ఆయనతోపాటు పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరవుతారన్నారు.

వజ్రకరూరు: మండల కేంద్రంలో ఆదివారం క్రిస్మస్ వేడుకలకు సీఎస్‌ఐ చర్చి ముస్తాబైంది. విద్యుత్ దీపాలతో చర్చిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆదివారం అర్ధరాత్రి పాస్టర్లు డానియల్ వినయ్‌కుమార్, ప్రమీలాజోసేఫ్, సోనిసాజన్య తదితరులు కేక్ కట్ చేసి క్రిస్మస్ కు స్వాగతం పలుకుతూ వేడుకలు ప్రారంభించారు. కార్యక్రమంలో సీఎస్‌ఐ సంఘసభ్యులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: క్రిస్మస్ పండుగకు మండలంలో చర్చిలు ముస్తాబయ్యాయి. మండలంలోని ఉద్దేహాళ్, బొమ్మనహాళ్, శ్రీధరఘట్ట, దర్గాహోన్నూరు, బండూరు, గోవిందవాడ తదితర గ్రామాల్లో చర్చిలు రంగు రంగుల విద్యుత్ దీపాల వెలుగులతో ఆకర్షణీయంగా తయారయ్యాయి.



రాయదుర్గం టౌన్: అలంకరణలో సెయింట్ మేరీమాత చర్చి



రాయదుర్గం టౌన్: రాజీవ్‌గాంధీ కాలనీలోని క్రైస్ట్ చర్చిలో క్రిస్మస్ సంబరాల పోస్టర్లు విడుదల చేస్తున్న సభ్యులు



వజ్రకరూరు: ముస్తాబైన సీఎస్‌ఐ చర్చి



బొమ్మనహాళ్ మండలం గోవిందవాడలో ముస్తాబైన చర్చి

### చురుగ్గా ఈ-క్రాప్ బుకింగ్



చిన్నహోతురులో ఈ-క్రాప్ బుకింగ్ నిర్వ హిస్తున్న అధికారులు

వజ్రకరూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో రబీ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటలకు ఈ- క్రాప్ బుకింగ్ నమోదు చురుగ్గా సాగుతుంది. రబీసీజన్‌లో రైతులు పప్పుశనగ, ధనియాలు, పెసర, ఉలవలు తదితర పంటలు సాగుచేశారు. ఏఓ మధుకర్ మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా ఈ-క్రాప్ బుకింగ్ నమోదు చేయించుకోవాలన్నారు. లేకపోతే ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు, నష్ట పరిహారం , బీమా కోల్పోవలసి వస్తుందన్నారు.

### ట్యాంక్ ఏర్పాటుకు భూమి పూజ



భూమి పూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు

ఉరవకొండ: పట్టణంలోని శివరామిరెడ్డి కాలనీలో సుమారు రూ.1.20 లక్షల నిధులతో ఏర్పాటు చేయనున్న బోర్‌వెల్ సిస్టం ట్యాంకు నిర్మాణానికి స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ఆదివారం భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో కలసి సర్పంచ్ లలిత భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఉరవకొండలో తాగునీటి సమస్య తలెత్తకుండా బోర్‌వెల్ సిస్టం ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వెంకటేశ్, వార్డు సభ్యులు వసికేరి మల్లి, నిరంజన్ గౌడ్, ఎంబీసీ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్, పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

### వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి

బ్రహ్మసముద్రం: మండలంలోని బొమ్మగానిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పాటిల్ పరమేశ్వర్‌రెడ్డి(65) శనివారం సాయంత్రం ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ చంద్రశేఖర్ రెడ్డి , పార్టీ నాయకులు అశోక్‌రెడ్డి, హనుమంతరెడ్డి, సర్పంచ్ ఆదినారాయణ రెడ్డి, ఎస్సీసెల్ జిల్లా కమిటీ నాయకుడు లింగమయ్య ఆదివారం ఆ గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

# వైభవంగా ఆంజనేయస్వామి రథోత్సవం

గుమ్మఘట్ట: మండలంలోని కలుగోడు, నేత్రపల్లిలో ఆంజనేయస్వామ రథోత్సవం వైభవంగా నిర్వహించారు. హనుమద్జయంతిని పురస్కరించుకుని ఆలయాల్లో అర్చకులు మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, ఆకుపూజ, పుష్పాలంకరణ, పూర్ణాహుతి చేపట్టారు. స్వామి ఉత్సవ విగ్రహాన్ని అడ్డపల్లకిలో తీసుకువచ్చి రథంలో కొలువుదీర్చి ఆయా గ్రామాల్లో మేళతాళాలు, డప్పులతో ఊరేగించారు. రథం ముందు యువకులు నందికోళ్లతో నాట్యం చేశారు. రథోత్సవాన్ని తిలకించడానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భారీగా తరలివచ్చారు. కార్యక్రమంలో సర్పంచులు కవిత, వినూత, ఎంపీపీ భవాని, ఎంపీటీసీలు ఓబుళకాంతమ్మ, శ్యామలమ్మ, జెడ్పీ మాజీ సభ్యుడు వన్నప్ప, మాజీ ఎంపీటీసీ సుకన్య, టీ శివకుమార్, కాంట్రాక్టర్ గౌని కాంతారెడ్డి, పాలాక్షిరెడ్డి, హనుమంతరెడ్డి, లక్ష్మీకాంతారెడ్డి, నాగేంద్రప్ప, రాజయ్య, హేమారెడ్డి, స్వామి, పీఏసీఎస్ అధ్యక్షులు బాబు, వీరారెడ్డి, భీమరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గుమ్మఘట్ట మండలం కలుగోడులో రథోత్సవ దృశ్యం



గుమ్మఘట్ట: 75 వీరాపురంలో ఉత్సవంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

#### ముత్యాలపల్లకిలో ఊరేగిన ఆంజనేయస్వామి

గుమ్మఘట్ట: మండలంలోని 75 వీరాపురం గ్రామంలో ఆంజనేయస్వామిని ఆదివారం ముత్యాలపల్లకిలో ఊరేగించారు. స్వామి ఉత్సవ విగ్రహాన్ని అలంకరించిన ముత్యాలపల్లకిలో అధిష్టించి ఆయా గ్రామాల్లో మేళతాళాల నడుమ ఘనంగా ఊరేగించారు. ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పల్లకోత్సవంలో పాల్గొన్నారు. ఉత్సవాలను తిలకించడానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పీఎస్ మహేష్, కె.పి.దొడ్డి సర్పంచ్ రమేష్, ఎంపీటీసీ గోవింద, రవి, ఎర్రిస్వామి, ఎస్సీ సెల్‌రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవింద, రుద్రరెడ్డి, మాజీ సర్పంచ్ రంగప్ప, గలగల సిద్దప్ప గోవిందరెడ్డి, గోపాల్, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ప్రారంభానికి సిద్ధంగా పశు వైద్యశాల

బెళుగుప్ప: మండల కేంద్రంలో ప్రభుత్వ పశు వైద్యశాల నిర్మాణ పనులు పూర్తయి ప్రారంభానికి సిద్ధమైంది. స్థానిక ప్రభుత్వ పశు వైద్యశాలలో 2019లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా చెలరేగిన మంటలకు భవనం, ఫర్నీచర్, రికార్డులు కాలిపోయాయి. అప్పటి నుంచి పశు వైద్యసేవలకు రైతులు ఇబ్బంది పడ్డారు. సమస్యను పరిశీలించిన ఎంపీ తలారి రంగయ్య ఎంపీ నిధుల నుంచి సుమారు రూ.30 లక్షలు మంజూరు చేయించి పనులు పూర్తి చేయించారు. బెళుగుప్ప పశువైద్యశాల అధికారి రమేష్ పరిధిలో మండలంలోని అన్ని ఆర్‌బీకేలలోనూ పశు వైద్యసేవలను అందించేందుకు మండల కేంద్రంలోని ప్రధాన కార్యాలయం కేంద్రంగా నిలవనుంది. ప్రభుత్వం సబ్సిడీతో గడ్డి విత్తనాలు, గడ్డి కత్తిరించే యంత్రాలు తదితర పథకాలను పశుపోషకులకు అందిస్తున్నామని వైద్యాధికారి తెలిపారు.

### చురుగ్గా వ్యవసాయ గోదాముల నిర్మాణం



వజ్రకరూరు: నిర్మాణంలో ఉన్న వ్యవసాయ గోదాము

వజ్రకరూరు: మండల కేంద్రంలో వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న వ్యవసాయ గోదాము నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. రూ.45 లక్షల వ్యయంతో చేపట్టిన వ్యవసాయ గోదాము నిర్మాణం పూర్తైతే రైతులు పండించిన పంట దిగుబడులు నిల్వ చేసుకునేందుకు ఉపయోగకరం. అలాగే ప్రభుత్వం సరఫరా చేసే విత్తనాలు, ఎరువులు తదితర వాటిని కూడా గోదాములో నిల్వ చేయవచ్చు. నిర్మాణ పనులను ఆదివారం వజ్రకరూరు పీఏసీఎస్ చైర్మన్ సుధీర్‌రెడ్డి, మాజీ సర్పంచు వైద్యనాథరెడ్డి తదితరులు పరిశీలించారు.

కూడేరు: కో-ఆపరేటివ్ బ్యాంక్ తరపున కూడేరులో జోడులింగాల సంగమేశ్వర స్వామి ఆలయం వద్ద గోశాల పక్కన నిర్మిస్తున్న మల్టీ పర్పస్ గోదాము నిర్మాణపు పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ గోదామును సుమారు రూ. 82 లక్షల వ్యయంతో నిర్మిస్తున్నట్లు కో-ఆపరేటివ్ బ్యాంక్ అధికారులు ఆదివారం తెలిపారు. 1000 మెట్రిక్ టన్నుల సరుకును నిల్వ ఉంచే సామర్థ్యంతో గోదామును నిర్మిస్తున్నామన్నారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేనపుడు లేదా వర్షాలకు సరుకు దెబ్బతినకుండా ఈ గోదాములో కొంత మొత్తాన్ని చెల్లించి నిల్వ ఉంచుకోవచ్చన్నారు. అలాగే ఫంక్షన్లు చేసుకోవచ్చన్నారు. బాడుగ రూపంలో వచ్చే ఆదాయంతో సొసైటీ బ్యాంక్‌ను బలోపేతం చేస్తామన్నారు.

# ఘనంగా హనుమద్ వత్రం



డీ హీరేహాల్ మండలం మురడిలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం



బొమ్మనహాళ్ మండలం నేమకల్లులో ముత్యాలపల్లకీ లాగుతున్న భక్తులు

రాయదుర్గం: నియోజకవర్గ వ్యాప్తంగా ఆదివారం పలు గ్రామాల్లో హనుమద్ వ్రత వేడుకలు ఘనంగా నిర్వహించారు. డి హీరేహాళ్, బొమ్మనహాళ్ మండలాల్లోని మురడి, నేమకల్లు గ్రామాల్లో ప్రసిద్ధి చెందిన ఆంజనేయస్వామి దేవాలయాల్లో వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు. అలాగే సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నవ కలశ స్థానం, మన్యుసూక్త, సుదర్శన హోమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అలాగే పలు గ్రామాల్లో అంజన్న రథోత్సవాలు, ఉత్సవ విగ్రహాల ఊరేగింపు కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో రాత్రి సామాజిక, పౌరాణిక నాటికలు ప్రదర్శించారు. హనుమన్ జయంతి వేడుకలు పురష్కరించుకుని మురడిలో ముత్యాల పల్లకోత్సవం నిర్వహించారు.

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం హనుమద్ వత్రం ఘనంగా నిర్వహించారు. ప్రధాన అర్చకుడు అనిల్‌కుమార్‌స్వామి ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, అభిషేకం నిర్వహించి స్వామిమూలవిరాట్‌ను పట్టువస్త్రాలు, వివిధ రకాల పుష్పాలతో శోభాయమానంగా అలకరించారు. అనంతరం ఆలయ ఆవరణంలో ముత్యాలపల్లకి ఉత్సవం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి ని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ నరసింహారెడ్డి, సర్పంచ్ పరమేశ్వర, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.





మురడి, నేమకల్లు ఆంజనేయస్వామి మూలవిరాట్లు

# రేపటి నుంచి 'ఆడుదాం ఆంధ్రా' పోటీలు

కళ్యాణదుర్గం: ఆడుదాం- ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈనెల 26 నుంచి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటేశులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. గ్రామ/ వార్డు సచివాలయ పరిధిలో 26వ తేదీ నుంచి జనవరి 9వ తేదీ వరకు, మండల స్థాయిలో 10వ తేదీ నుంచి 23వ తేదీ వరకూ పోటీలు నిర్వహిస్తామన్నారు. అలాగే నియోజకవర్గ స్థాయిలో 24వ తేదీ నుంచి 30వ తేదీ వరకు, జిల్లా స్థాయిలో ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి 5వ తేదీ వరకు, రాష్ట్ర స్థాయిలో 6వ తేదీ నుంచి 10వ తేదీ వరకూ పోటీలు ఉంటాయన్నారు. క్రీడా పోటీలను స్థానిక కరణం చిక్కప్ప ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తామన్నారు. క్రీడాకారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

**పోటీల నిర్వహణకు సర్వం సిద్ధం**

కూడేరు: మండలంలో ఈ నెల 26న ప్రారంభమయ్యే ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల నిర్వాహణకు మైదానాలు సిద్ధం చేసినట్లు పీడీలు అక్కులప్ప, అంజనాబాయి, రుక్మిణి, నరసింహులు, రిజ్వానా ఆదివారం తెలిపారు. కమ్మూరు వద్ద క్రికెట్ పోటీలు నిర్వహిస్తామన్నారు. కూడేరులోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ కోర్టులను సిద్ధం చేశామన్నారు. ఎంపీడీఓ ఎంకే బాషా, ఎంఈఓ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అన్ని సచివాలయాల పరిధిలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులను సమన్వయం చేసుకుని పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు వారు తెలిపారు.



కూడేరు : క్రీడల నిర్వహణకు మైదానం సిద్ధం చేస్తున్న పీడీలు

**విజయవంతం చేయాలి**

గుమ్మఘట్ట: ఆడుదాం ఆంధ్రా కీడ్రా పోటీలను విజయవంతం చేయాలని ఎంపీడీఓ నరసింహమూర్తి తెలిపారు. మండలవ్యాప్తంగా ఉన్న 15 గ్రామ సచివాలయాల పరిధిలో 1,462 మంది క్రీడాకారులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. ఖోఖో, వాలీబాల్, బాడ్మింటన్, క్రికెట్, కబడ్డీ పోటీలను 75 వీరాపురం, తాళ్లకెర, గుమ్మఘట్ట, సిరిగెదొడ్డి, భూపసముద్రం గ్రామాల్లో నిర్వహిస్తామన్నారు.

# బొమ్మనహాళ్‌లో కనకదాస జయంతి



కనకదాస చిత్రపటాన్ని ఊరేగిస్తున్న కురుబ సంఘం నాయకులు

బొమ్మనహాళ్: మండల కేంద్రంలో కనకదాస జయంతి వేడుకలను కురుబలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేదావతి హగరి నది నుంచి ప్రత్యేక గంగ జలాన్ని 101 కలశాలతో ఊరేగిపుంగా తీసుకువచ్చి కనకదాస చిత్రపటానికి అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేపట్టారు. సాయంత్రం కనకదాస చిత్రపటాన్ని కలశాలతో గ్రామంలో పెద్ద ఎత్తున ఊరేగించారు. కార్యక్రమంలో కురుబ సంఘం కురుబ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజహంస శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్‌కే మల్లికార్జున , మండల అధ్యక్షులు పరమేశ్వర, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ యంద్రకాయల వంద్రప్ప, బసవరాజు, భీమప్ప, ముత్తన్న, నాగరాజు, ఎర్రిస్వామి, గాధిలింగ, చిక్కణ్ణ తదితరులు పాల్గొన్నారు.

### 'జగనన్న ఆరోగ్య సురక్ష' పేదలకు వరం



కంటి అద్దాలను అందజేస్తున్న ఏఎన్‌ఎం సుశీల

కూడేరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యాన్ని పరిరక్షించాలన్న లక్ష్యంతో సెప్టెంబర్ , అక్టోబర్ నెలల్లో మండలంలో నిర్వహించిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం సత్ఫలితాలనిచ్చింది. వైద్యులు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు సుమారు నెల రోజులు పాటు ఇంటింటా అందరికీ హెల్త్ చెకప్ చేశారు. ఆరోగ్య సమస్యలున్న వారిందరిని గుర్తించారు. సచివాలయాల పరిధిలో హెల్త్ క్యాంపులు నిర్వహించి నిపుణులచే వైద్య సేవలందించారు. మండల వ్యాప్తంగా 592 మంది కంటి సమస్యతో బాధపడుతున్నట్లు వైద్య సిబ్బంది గుర్తించారు. అందులో చోళసముద్రంలో 44 మంది, గొటుకూరులో 10, ఇప్పేరులో 9, కమ్మూరులో 74, కొర్రకోడులో 54, మరుట్లలో 75, పి.నారాయణపురంలో 96, తిమ్మాపురంలో 68, ఉదిరిపికొండలో 111 , కూడేరులో 51 మంది చొప్పున ఉన్నారు. వారందరికీ ప్రభుత్వం ఉచితంగా అద్దాలు సరఫరా చేసింది. శనివారం ఆయా గ్రామాల్లోని లబ్ధిదారులకు వైద్యాధికారులు అద్దాలు అందజేశారు. దీంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. గతంలో ఏ సీఎం కూడా ప్రజారోగ్యం పట్ల ఇంత శ్రద్ధ చూపలేదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉంటామన్నారు.

### కుటుంబ సమస్యలతో వ్యక్తి ఆత్మహత్యయత్నం

శెట్టూరు: మండలంలోని చిన్నంపల్లిలో వడ్డే రామన్న అనే వ్యక్తి ఆత్మహత్యకు యత్నించాడు. పోలీసుల వివరాల మేరకు.. కుటుంబ సమస్యలతో మధనపడుతున్న ఆయన ఆదివారం తోటలోకి వెళ్లి పురుగుల మందు తాగాడు. తోటలో స్పృహలేకుండా పడి ఉన్న రామన్నను చూసిన కుటుంబసభ్యులు వెంటనే కళ్యాణదుర్గం ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురం ఆస్పత్రికి తరలించారు.